ఆ రోజు...

వర్షం పడి వెలిశాక వాతావరణం ఆహ్లాదంగా ఉంది. నాన్నగారు అరగంటలో వచ్చేస్తానని చెప్పి బయటకు వెళ్ళారు. నాన్నమ్మ పక్కింటివాళ్ళకి మనవడు పుట్టాడని చూసి రావటానికి వెళ్ళింది. నేను సరదాగా మొక్కల చుట్టూ ఉన్న గడ్డి పరకల్ని తీసి పాదులు చేస్తున్నాను. ఇంతలో పద్మ హడావుడిగా పెరట్లో ఉన్న నా దగ్గరకు వచ్చింది. ముందు హాలు గది గడియ వేసుకోమని నాన్నమ్మ చెప్పింది కానీ...ఈ కాస్త పనీ అయ్యాక ఎలాగూ ఇంట్లోకి వెళ్తాగదా అనుకుంటూ బద్ధకించాను. "అంకుల్ ఇంట్లో లేనట్లున్నారే ... ఇప్పుడెలా? ఇనిస్టిట్యూట్ నుంచి వస్తోంటే వెంటపడి గొడవ చేస్తున్నాడని చెప్పానే... అతన్ని తీసుకువచ్చాను... " అంది కంగారు కంగారుగా.

పద్మ రోజూ సాయంకాలం పూట కంప్యూటర్ క్లాసులకీ వెళ్తోంది. ఎవరో అతను వెంటబడి ప్రేమా, దోమా అంటూ వేధిస్తున్నాడని చెప్పింది. పద్మకు తల్లి లేదు. సవతి తల్లి నోరు చాలా పెద్దది. పద్మలో ఏ తప్పు కనిపిస్తుందా అని అరవడానికి సిద్ధంగా ఉంటుంది. ప్రేమా గీమా అంటూ ఏవైనా పిచ్చి వేషాలేస్తే, చదువు మానిపించి ఇంట్లో కూర్చోబెడతానని వార్నింగ్ ఇచ్చిందావిడ. ఇప్పుడితను పక్క పక్కనే నడుస్తూ రావడం.... మాట్లాడబోవటం... ఎవరైనా చూసి పిన్నికి చెబితే ఎంత రభస అవుతుందో అని పద్మ భయపడుతుంటే... నేనే ఒక సలహా ఇచ్చాను.

మా ఇల్లు దారిలోనే కాబట్టి ఫ్రెండ్ ఇంట్లో కూర్చుని మాట్లాడుకుందాం రమ్మని చెప్పి తీసుకువస్తే, నాన్నగారితో గట్టిగా చివాట్లు పెట్టిద్దామని అన్నాను. అందుకే ఇప్పుడు అతన్ని తీసుకువచ్చిందన్నమాట.

నుదుటి మీద పడుతున్న జుట్టును వెనక్కితోసి, "నాన్న లేకపోతేనేం, నేనున్నాగా, చూడు... ఎలా దుమ్ము దులిపేస్తానో...." అన్నాను రెండు అరచేతుల్నీ కలిపి దులుపుకుంటూ.

"ఏయ్... మొహానికి మట్టి అంటుకుందే..." పద్మ అంటే, "ఇవేమైనా పెళ్ళిచూపులా, ఫర్వాలేదులే.... పద..." అన్నాను.

"ఎందుకొచ్చిన గొడవలే గానీ... ఏదో మామూలుగా మాట్లాడు... గట్టిగా కోప్పడకు.." అంది బెదురుగా చూస్తూ.

పద్మకి భయమెక్కువ. చాలా పిరికిది. వెంటబడి వస్తున్నవాడితో గట్టిగా మందలిస్తూ మాట్లాడటానికీ భయమే. ఇంట్లో వాళ్ళతో ఏ మాట అయినా చెప్పుకోవటానికీ భయమే! బొత్తిగా నోరు లేదు!

"నీకెందుకు... నేను మాట్లాడతాగా ... నువ్వుండు..." అంటూ లోపలకి వచ్చాను.

వీరనారిలా చాలా ఆవేశంగా వచ్చిన నేను ... హాలు గది గుమ్మం దగ్గర రెప్పవేయటం కూడా మరిచిపోయినట్లుగా విభ్రాంతిగా – ఒక క్షణం నిలబడిపోయాను!

సోఫాలో కొంచెం వెనక్కి ఆనుకుని కూర్చుని మాగజైన్ తిరగేస్తున్న అతనిని చూసి .. ఇదేమిటి పద్మను అల్లరిపెట్టే ఆకతాయి కుర్రాడిలా ఉన్నాడేమిటనుకున్నాను.

నిజం చెప్పాలంటే... మోహనరాగమహా మూర్తివంతమాయె అన్నట్లుగా ఉన్నాడు! పసిమి రంగులో, చక్కని కనుముక్కు తీరుతో అందంగా మాత్రమే కాదు, చదువు సంస్కారం కలవాడిలా ఉన్నాడు! ఇతని గురించి పద్మ కాకుండా ఇంకెవరైనా అలా చెప్పి ఉంటే అస్సలు నమ్మేదాన్ని కాదేమో! పద్మ తమాషాకైనా అసత్యాలు... అతిశయోక్తులు గానీ చెప్పదని నాకు తెలుసు.

ఆకారానికీ, అంతరంగానికీ పొంతన లేకపోవటమనే విషయానికి ఇతనే నిర్వచనంలా ఉన్నాడు! ఎలా ఉంటే ఏమిటి... ప్రవర్తన సవ్యంగా లేనప్పుడు ఖండించాల్సిందే!

అతను కూర్చున్న సోఫాకు ఎదురుగా కుర్చీని ఆనుకుని నిలబడి ఒకే ఒక క్షణం నిశితంగా చూశాను, ఇతనేమిటి... పద్మను అల్లరి చేయటమేమిటి... ఛ...ఛ.. నిజం కాదు అనిపించింది. మళ్ళీ పద్మ అబద్ధం చెప్పే రకం కాదుగా... అనుకుంటూ...

"ఏం చదివారు...?" అనడిగాను. స్టూడెంటులా అనిపించలేదు... అందుకే ఏం చదువుతున్నారని? అనడగలేదు.

అతని కళ్ళల్లో కొంచెం విస్మయం కనిపించింది. చేతిలోని మేగజైన్ టీపాయ్ మీద పెట్టేస్తూ "ఏదో మామూలు చదువే... ఫుల్‌స్టాప్ పెట్టి చాలానాళ్ళయింది..." అన్నాడు.

"ఉద్యోగం...?" ఇంటర్వ్యూ చేస్తున్నదానిలా అడిగాను.

లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపుతూ పెదవులు విరిచాడు.

"నిరుద్యోగులన్నమాట...!" అంటూ నేనూ కూర్చుని విసురుగా "పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యం ఉందా...?" అనడిగాను.

"అబ్బే... ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదండి..." పెదవుల మీదికి చిరునవ్వు వచ్చింది.

ఉద్యోగం లేదు కాబట్టి పెళ్ళి ఆలోచన లేకపోవటం బాగానే ఉంది. మరి ప్రేమ మాత్రం ఎందుకూ... కాలక్షేపం కాబోలు!

"ప్రేమ... అంటే... మీ ఉద్దేశ్యం ఏమిటి?" సూటిగా అడిగాను, నేను తీసుకోబోయే క్లాసుకి నాందీ సూచనగా.

"ప్రేమంటే... ప్రేమే ... నాకేం కోపం లేదు..." అతని కళ్ళల్లో కనిపించిన అల్లరి నవ్వుకు నాకు చాలా ఆవేశం వచ్చేసింది.

"ఉద్యోగం లేదు... పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యం లేదు! మరి ప్రేమంటూ ఆడపిల్లల వెంటబడటం మాత్రం ఎందుకండీ...? కాలక్షేపమా?" నేను అంత ఆవేశంగా అడుగుతున్నా... అతనేం బెదురు లేకుండా తాపీగా చిదానంద స్వామిలా చిరునవ్వుతోనే చూస్తుండటంతో నాకు చిర్రెత్తింది.

"ప్రేమనేది... అపురూపమైన మధుర భావన! అది ఏ ఇద్దరి మధ్యనైనా పువ్వు వికసించినంత సహజంగా కలగాలి..! వెంటబడి వేధిస్తే.. మొగ్గ వికసిస్తుందా... ప్రేమ పుడుతుందా..? పైకి సంస్కారవంతుల్లా కనిపిస్తున్నారు. ఇలా ఆకతాయిలా..."

నా మాటలకు మధ్యలోనే అడ్డు వచ్చి "ప్రేమ గురించి... ఏంటన్నారూ... మీరు చెప్పింది ఏదో బావున్నట్లుందే... మళ్ళీ ఓ సారి చెప్పండి...." అనేసరికి నేను కోపం ఆపుకోలేకపోయాను.

"మీకు .. వేళాకోళంగా ఉందా... ప్రేమా అంటూ వెంటబడటం.. మీకు చెలగాటమే కావచ్చు. అమ్మాయలకది ఎంత సంకటంగా ఉంటుందో మీకెందుకు అర్థం కాదు...?" ప్రేమించానని అనగానే మీ అందానికి అమ్మాయిలు పడిపోతారని మీ ఉద్దేశ్యం ... అవునా?"

అతని పెదవుల మీది చిరునవ్వు మాత్రం చెక్కు చెదరలేదు. "థేంక్స్..." అన్నాడు.

"దేనికీ?" అర్థంకాక అడిగాను.

"మీరిచ్చిన కాంప్లిమెంటుకి! ఒకమ్మాయి నోటి నుండి నా అందం గురించిన మాట వినటం ఇదే మొదటి సారి మరి!" అన్నాడు.

"అందం గురించి కాదు, మీ ప్రవర్తనను ప్రశంసిస్తే అప్పుడు ఆనందించండి... మీరంటే ఆసక్తి చూపించే అమ్మాయి వెంటపడాలిగానీ ఇష్టం లేదు అని మొత్తుకుంటున్న వాళ్ళని ఇబ్బంది పెట్టడం..."

వెనక నుండి "సుజనా ... సుజనా.." అంటూ పద్మ మెల్లగా పిలవడం వినిపించి మాటలు ఆపి అటు వేపు చూశాను. అరచేత్తో నుదురు మీద కొట్టుకుంటూ దగ్గరకు రమ్మని పిలిచింది.

పద్మ దగ్గరకు వెళ్ళి, "నువ్వు మాట్లాడలేవు సరే, నేనడుగుతున్నా నువ్వెందుకే అంత కంగారు పడిపోతున్నావ్?" అన్నాను కొంచెం చిరాగ్గా.

"అది కాదే బాబూ... నీ ధోరణి నీదే గానీ నేను పిలుస్తున్నా నువ్వు వినిపించుకోవటం లేదు. నేను తీసుకు వచ్చింది ఇతన్ని కాదే... ఇతనెవరో నాకు తెలియదు!" అంది.

ఒక క్షణం నాకు మతిపోయినట్లయింది. తెల్ల మొహం వేశాను.

ఛీ... ఛీ... వెనకా ముందూ ఆలోచించకుండా ఇంత తెలివితక్కువగా ప్రవర్తించానేమిటీ ... నన్ను నేనే తిట్టుకున్నాను. అయినా పద్మ లోపలకు వచ్చిన ఆ కాస్త టైములోనే అతనేమయ్యాడూ, ఇతనెప్పుడు వచ్చాడూ... ఎవరి కోసమో... అయోమయంగా అనిపించింది.

అతని దగ్గరకు వచ్చి మెల్లగా "సారీ... నా ఫ్రెండుని ఎవరో... అల్లరి చేస్తుంటే... తొందరపడి.." అంటూ నసుగుతుంటే అతను చిరునవ్వుతో "మీరు చెప్పకుండానే సీన్ నాకర్థమైంది! నేను వచ్చేటప్పటికి ఇక్కడున్న అతన్ని 'విశ్వనాథంగారున్నారా?' అనడిగితే

తడబడుతూ 'ఉన్నారు' అని చెప్పి కంగారుగా వెళ్ళిపోయాడు. మీరు అతని గురించే మాట్లాడుతున్నారని ఊహించాను" అన్నాడు.

"మీరు ... నాన్నగారి కోసం వచ్చారా? ఇంతకు ముందే బయటకు వెళ్లారు. కాసేపటిలోనే వచ్చేస్తానని చెప్పారు..." అన్నాను.

"లాయరు రామబ్రహ్మంగారితో కలిసి వస్తానని చెప్పాను! ఎవరో ముఖ్యమైన క్లయింట్ రావటంతో ఆయన ఆగిపోయారు..." అంటూ తన పేరు 'విష్ణు' అని చెబుతూ పరిచయం చేసుకున్నారు.

నేనూ పద్మని పిలిచి పరిచయం చేసి సంగతంతా చెప్పి "మీరు .. వేరే అని ఎందుకు చెప్పలేదూ?" అని అడిగాను.

"నేను ...నేనేగా... వేరే అని ఎలా చెబుతానూ?" తమాషాగా అనేసరికి నవ్వాం. పద్మని అక్కడే కూర్చోమని చెప్పి నేను లోపలకి వెళ్ళి మూడు గ్లాసులతో నిమ్మకాయ జ్యూస్ తెచ్చాను.

రెండు నిమిషాల తర్వాత విష్ణు పద్మ చేతికి తన ఫ్రెండ్ సి.ఐ. నెంబరు ఇచ్చి "మళ్ళీ ఎప్పుడైన అల్లరి చేస్తే ఫోన్ చేసి చెప్పండి. వెంటనే స్టేషనుకి తీసుకెళ్ళి పెళ్లి చేస్తారు. ప్రేమ పిచ్చి వదిలిపోతుంది! అయినా మీకు అంత అవసరం రాకపోవచ్చునేమో... మీ ఫ్రెండ్ ఝాన్సీ రాణియే ఆ పని చేయగలరు!" అన్నారు.

"ఝాన్సీ రాణి ఎవరూ?" పద్మ అడిగింది. నాకూ ఆ సందేహం వచ్చింది.

"ఇంకెవరు..." అంటూ నా వైపు చిరునవ్వుతో చూశారు. "ఆ మధ్య రోటరీ క్లబ్ వాళ్ళు కండక్ట్ చేసిన ఎలక్యూషన్ కాంపిటీషన్‌లో మీ స్పీచ్ విన్నాను. ఆ రోజు మీకు నేను పెట్టుకున్న పేరది!"

నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది అతను చెప్పిన విషయమంతా విన్నాక. కాలేజీ స్టూడెంట్స్‌కు రోటరీ క్లబ్ వాళ్ళు 'సమాజం పట్ల యువతీ యువకుల బాధ్యత' అనే టాపిక్ మీద వక్తృత్వ పోటీ నిర్వహించారు. కళాక్షేత్రం హాలుకి ఫ్రెండుని కలవటానికి వచ్చి వెళ్లిపోతున్న విష్ణు నా స్పీచ్ మొదలయ్యేసరికి ఇంటరెస్ట్‌గా అనిపించి, నిలబడే వింటూండిపోయారట. వెళ్తూ 'ప్రైజు ఈ ఝాన్సీరాణికి వచ్చిందో లేదో ఫోను చేసి చెప్పమని' ఫ్రెండుతో అన్నారట. ఇద్దరికీ నా పేరు తెలియనందున అలా అనుకున్నామని అన్నారు. మరునాడు నా పేరుతో పాటు ప్రైజూ నాకే వచ్చిందనే విషయం ఫ్రెండు

తెలియజేశాడట. ఇదంతా చెప్పి "మంచి కొటేషన్స్‌తో మీ స్పీచ్ ప్రవాహంలా సాగిపోవటం, మాటల్లో కనిపించిన ఆవేశం నాలాంటి వాళ్ళనే కాదు, జడ్జీలను కూడా బాగా ఇంప్రెస్ చేశాయనుకుంటా, అందుకే ఫస్ట్ ప్రైజు వచ్చింది! ఇప్పటికీ నాకు ఒక వాక్యం బాగా గుర్తుండిపోయింది. అది ... 'ప్రతీ యువతీ, యువకుడూ నైతికత అనే కరవాలాన్ని ధరించి ఎక్కడ అన్యాయం, అక్రమం కనిపించినా ఖండించే ధైర్యం, సాహసం కలిగి ఉండాలి!' కరెక్ట్‌గానే చెప్పానా...?" అని అడిగేసరికి సంభ్రమాశ్చార్యాలతో నాకు ఒక క్షణం నోట మాట రాలేదు!

నా శరీరం మొత్తం గాలిలోకి లేచి గిర్రున తిరిగినట్లనిపించింది! నిజాయితీగా చేశారనిపించే ప్రశంసకి ఇం... త పారవశ్యం కలుగుతుందా..?!

ఇంతలో నాన్నగారు వచ్చారు.

విష్ణు వస్తారని నాన్నగారికి ముందే తెలుసు కాబోలు. "మీరు వచ్చేలోగా వచ్చేద్దామనుకుని వెళ్ళాను .. సారీ ... లేటయింది" అన్నారు.

"ఫరవాలేదు.. నేనే కొంచెం ముందుగా వచ్చినట్లున్నాను." అని విష్ణు అన్నారు.

పద్మ, నేను లోపలకు వచ్చేశాం. పద్మ ఇంటికి వెళ్తానంటూ బయలు దేరింది. "నీకు బొత్తిగా జి.కె. శూన్యమని నాకీ రోజే తెలిసిందే..." అంది నవ్వు మొహంతో.

"ఎందుకనో?"

"లేకపోతే ఏమిటి... అతన్ని చూడగానే ఆవారా టైపు కాదని ఎవరికైనా ఇట్టే తెలుస్తుంది. నీకు తెలియలేదంటే ఏమనుకోవాలే? అయినా నలకుబేరుడు లాంటి అబ్బాయి నన్ను ప్రేమించానంటూ వెంటబడితే.. మా పిన్నినీ, ఈ పాడు ప్రపంచాన్నీ వదిలేసి పక్షిలా అతని వెంట అడవికైనా ఎగిరిపోతానుగానీ 'రక్షించవే బాబూ' అంటూ నీకు మొరపెట్టుకుంటానా చెప్పు...."

"నీ మాటల మీదున్న నమ్మకంతో నేను దాడి చేస్తే నాకు జనరల్ నాలెడ్జి శూన్యమంటావా? సరిగ్గా ఆ సమయానికే వాడెవడో వెళ్ళిపోవడం.. ఇతను రావటం జరుగుతాయని నేనెలా అనుకుంటానూ! నీ ఉద్దేశ్యం ఏమిటే... అబ్బాయి అందంగా ఉంటే చాలా, ఏం ఆలోచించకుండా ఓకే చేసేస్తావా? అందమైన విలన్లూ ఉంటారు తెలుసా? అసలు నీకే జి.కె. జీరో అని నాకనిపిస్తోంది!"

"అందం కాదు, చూస్తుంటే పెద్దమనిషి తరహా తెలియటం లేదా?"

"నీకు ... వయసు మీరిన వాడిలా ... పెద్ద మనిషిలా అనిపించాడా? నాకలా కనిపించలేదే!" సరదాగా జోక్ చేశాను.

"అయితే ఇంకేం అతనికి పెళ్ళి అయిందో, లేదో వాకబు చేయమని అంకుల్‌కి చెబుతానుండు. అసలే నిన్నతను బాగా మెచ్చుకున్నాడు కూడా కదా!" అని నవ్వుతూనే "అమ్మో .. చాలా టైమయిపోయింది. ఇంకా లేటయితే మా పిన్ని ముందు నా పెళ్ళి చేసేస్తుంది" అంటూ వెళ్ళిపోయింది.

రెండు నిమిషాల తర్వాత నాన్నమ్మ లోపలకు వస్తూ "ఎవరే ఆ అబ్బాయి" అని నన్నడిగింది. నేను పరధ్యానంగా "నలకూబరుడు" అనేశాను. "ఏమిటీ... బకాసురుడా, అలాంటి పేరు కూడా పెట్టుకుంటారా?" అంది విస్తుపోతూ.

నాకు నవ్వొచ్చింది. "ఛ... అదేం కాదులే... మనకి తెలిసినవాళ్ళు కాదు. నాన్న కోసం వచ్చారు."

"అబ్బాయి చందమామలా ఉన్నాడు!" తనలో తను అనుకుంటున్నట్లుగా అంది.

* ❀ *

# 4

ఆ రాత్రి భోజనాల దగ్గర నాన్నగారు అతని గురించి చెప్పారు. రెండు రోజుల క్రితం రామబ్రహ్మం అంకుల్ ఇంటికి నాన్నగారు వెళ్ళినప్పుడు విష్ణును పరిచయం చేశారట. వాళ్ళది హైదరాబాదు. ఇక్కడకు మూడు గంటల ప్రయాణంలో ఉన్న ఊరిలో వాళ్ళకి భూములేవో ఉన్నాయి. కౌలు చేస్తున్న రైతులు వీళ్ళకేమీ ఇవ్వటం లేదు. బిజినెస్‌లో వచ్చిన ఒడిదుడుకుల వల్ల డబ్బు అవసరం కొద్దీ ఆ భూముల్నీ అమ్మేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఆ ఊళ్ళో నాన్నగారికి తెలిసిన వాళ్ళు ఉన్నారు. అందుకని నాన్నగారిని కూడా వెంటబెట్టుకుని వెళ్తే తెలిసిన వాళ్ళ ద్వారా ఆ భూములకు మంచి రేటు రావచ్చని రామబ్రహ్మం అంకుల్ సలహా ఇవ్వటంతో ఆ విషయం మాట్లాడటానికే విష్ణు మా ఇంటికి వచ్చారని నాన్నగారు చెప్పారు.

అనుకున్నట్లుగానే నాన్నగారు కూడా వాళ్ళిద్దరితో కలిసి ఆ ఊరు వెళ్ళి సాయంకాలానికి వచ్చారు. "వెళ్ళిన పని అయిందా?" అని నాన్నమ్మ అడిగింది.

నాన్నగారు చెప్పిన సంగతులు వింటోంటే ఆశ్చర్యంగా అనిపించింది! ఆ ఊళ్ళోని వాళ్ళ భూముల్ని మంచి ధరకే కొనటానికి కొందరు ముందుకు వచ్చినా విష్ణు మనసు మార్చుకున్నారట! దానికి కారణం కౌలు చేస్తున్న రైతుల పరిస్థితిని స్వయంగా చూసి తెలుసుకోవటమే.

ఆ రైతులు కొన్ని సంవత్సరాల నుండీ విష్ణు వాళ్ళకి కౌలు ఇవ్వకపోవటం నిజమే. అయితే వాళ్ళకి వస్తున్న రాబడి కూడా చాలా కొద్దిగా అంతంత మాత్రంగానే ఉండటంతో వాళ్ళు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నారు. ఈ రెండు సంవత్సరాల నుండీ పంటలు బాగా పండటంతో వాటికి కూడా మంచి రేటు వచ్చింది. వాటిని ఇప్పుడు అమ్మటం వలన విష్ణు వాళ్ళకి లాభమే గానీ కౌలు చేస్తున్న రైతులకు మాత్రం తేరుకోలేని దెబ్బ అవుతుంది. కొన్ని సంవత్సరాలుగా ఎన్నో కష్టనష్టాల కోర్చి సాగుచేస్తున్న రైతుల దగ్గర్నుండి లాభాలు వస్తున్న తరుణంలో ఆ భూముల్ని తీసేసుకోవటం విష్ణుకు చాలా దారుణంగా అనిపించి, వాళ్ళకే వదిలెయ్యాలని నిర్ణయించుకున్నారట! ఆర్థికంగా ఇబ్బందులున్న పరిస్థితుల్లో అటువంటి నిర్ణయం తీసుకోవటం సమంజసం కాదని, బాగా ఆలోచించుకోమని అంకుల్ విష్ణుకు నచ్చచెప్పబోతే... విష్ణు స్థిరంగా ఒకే మాట చెప్పారట.

“ఇన్నాళ్ళూ రైతులు కౌలు ఇవ్వటం లేదని అనుకుంటున్నామే తప్ప వాళ్ళెలాంటి పరిస్థితుల్లో ఉన్నారో మేం పట్టించుకోలేదు. ఇప్పుడు చూశాకనే తెలిసింది.... ఆ భూముల మీద న్యాయమైన హక్కు వాళ్ళేదేనని! ఉచితంగా పొందినట్లు అనిపించకుండా ఏదో నామమాత్రపు ధర నిర్ణయించి, వాళ్ళ అప్పులన్నీ తీరాక కొంచెం కొంచెంగా ఇవ్వొచ్చునని చెబుతాను. అమ్మా, నాన్న కూడా నా నిర్ణయాన్ని ఎప్పుడూ కాదనరు” అని.

ఇదంతా చెప్పి నాన్నగారు అన్నారు. “ఆ భూముల్ని కౌలు చేస్తున్న రైతులకే రాసి ఇచ్చేస్తామని అతను చెప్పినప్పుడు వాళ్ళ సంబరం చూడాలి... అంతా ఇంతా కాదు! పరిస్థితులన్నీ బాగున్నప్పుడయితే ఫరవాలేదు గానీ... వాళ్ళకే బాగా లేకపోయినా అటువంటి నిర్ణయం తీసుకోవటం మాత్రం చాలా గొప్ప విషయంగా అనిపించింది!”

నాన్నగారి కళ్ళల్లో ప్రశంస స్పష్టంగా కనిపించింది.

నాన్నమ్మ కూడా “అవున్నిజమే..” అంటూ తలాడించింది.

నలకూబరుడిలో దానకర్ణుడి అంశ కూడా ఉందన్నమాట అనుకున్నాను.

✻ ❀ ✻

వారం రోజుల తర్వాత భవానీ ఆంటీ ఫోన్ చేస్తే రామబ్రహ్మం అంకుల్ వాళ్ళింటికి వెళ్ళాను. ఆంటీకి సంగీతం వచ్చు. తనకి వచ్చిన విద్యని ఎవరికైనా నేర్పాలనే సరదా కూడా ఉంది. వాళ్ళమ్మాయి కరుణకి నేర్చుకోవాలనే ఆసక్తి లేదు. ఆపైన ఇప్పుడు బెంగుళూరులో జాబ్ చేస్తోంది. అందుకే పాటలంటే నాకున్న ఆసక్తిని గమనించి ఆంటీ నేర్పిస్తానని అంటే... వారానికి రెండు సార్లు వచ్చి లలిత సంగీతం నేర్చుకుంటున్నాను. ఆ తర్వాత ఆంటీకి కాసేపు నేను స్పోకెన్ ఇంగ్లీషు నేర్పించాలి. ఆవిధంగా మేమిద్దరం ఒకరికొకరం గురువులం, శిష్యులం!

"ఏమిటి ఆంటీ రేపు క్లాసుకి వస్తాగా, ఈ రోజు రమ్మని ఫోన్ చేశారేం?" అడిగాను.

"నీ ఫ్రెండ్ కరుణ వచ్చింది. మళ్ళీ రేపు వెళ్ళిపోతుందని రమ్మన్నాను" అన్నారు. లోపలి నుండి కరుణ "ఏయ్ సుజనా...వచ్చావా!" అని పలకరిస్తూ వచ్చి కూర్చుంది. ఆంటీ ముభావంగా ఉండడం చూసి 'విషయం ఏమిటన్న'ట్లుగా కరుణ వేపు చూశాను. "మామూలే, కొత్త సంగతేం కాదులే" అంటూ నవ్వింది.

కరుణ చదువు పూర్తి చేసి ఉద్యోగం చేస్తోంది. కాబట్టి ఇక పెళ్ళి చేసెయ్యాలని భవానీ ఆంటీ తాపత్రయపడుతున్నారు. కరుణ పెళ్ళి వద్దంటూ మొండికేస్తోంది. భవానీ ఆంటీ ఇద్దరు అక్కయ్యల పిల్లలిద్దరూ కూడా భర్తలతో ఏవో మనస్పర్థలొచ్చి విడాకులు తీసుకున్నారు. వాళ్ళని చూసినందువలనేమో కరుణకు పెళ్ళి పట్ల వైముఖ్యం ఏర్పడిందనుకుంటాను.

"కన్నవాళ్ళని, పుట్టి పెరిగిన ఇల్లు వాకిలినీ వదిలి పెట్టి ఎవరింటికో వెళ్ళి వాళ్ళు చెప్పినట్లు బ్రతకటమెందుకూ... స్వేచ్ఛగా, హాయిగా నేనిలాగే ఉంటాను!" అని కరుణ అంటుంది. ఎవరికో సమస్యలొస్తే, అలాంటివి మనకెదురవకుండా జాగ్రత్తలు తీసుకోవటానికి ప్రయత్నించాలే తప్ప పూర్తిగా పెళ్ళే మానుకుంటాననటం ఏమిటని ఆంటీ అంటారు. నాకూ అదే కరెక్టనిపిస్తుంది. ఇప్పుడేదో మంచి సంబంధం వచ్చిందట. కరుణ పాత పాటే పాడుతోందని ఆంటీ చిరాగ్గా అన్నారు.

నేనూ కరుణకి నచ్చచెప్పటానికి ప్రయత్నించాను. "కరుణా... నీ పట్టుదల ఏంటో నాకూ అర్థం కావటం లేదే! పెళ్ళితో పుట్టి పెరిగిన ఇల్లు వదిలి పెట్టాలని అంటున్నావు. ఏం, నువ్వు ఇప్పుడు మాత్రం ఉద్యోగం పేరుతో వేరే ఊళ్ళో ఉండడం లేదా? ఆడపిల్లయినా, మగపిల్లాడైనా చిన్నప్పటి నుండీ ఇంట్లో తల్లిదండ్రుల మాటను, స్కూల్లో మాష్టర్ల ఆదేశాల్నీ, ఆఫీసుల్లో బాస్‌ల ఆజ్ఞల్నీ వినాల్సిందేగా? అలాగే భార్యాభర్తలిద్దరూ కూడా ఒకరి మాటను ఒకరు వింటారు.... మన్నిస్తారు. సర్దుబాటును స్వేచ్ఛ పోగొట్టుకోవటమని ఎందుకనుకోవాలీ? పెళ్ళి అంటే మధురమైన స్నేహబంధమనుకోవాలి గానీ ఒకరికి బందీగా మారటమనుకోవటమేమిటీ...? పెళ్ళిని కాదనుకుంటే జీవితాంతం మన వెంట ఉండే ప్రియ నేస్తాన్ని పోగొట్టుకోవటమే అవుతుంది.... జీవితంలోకి రాబోతున్న వసంతాన్ని వద్దని చేతులడ్డం పెట్టటంలా ఉంటుంది!" నాటకీయంగా మాట్లాడుతున్నానేమోనని నాకే అనిపించి నవ్వొచ్చింది.

"ఇంకో మాట కూడా చెప్పనా? పెళ్ళితో మనకు అత్తవారిల్లూ ఏర్పడుతుంది. బంధువులూ, ఆత్మీయులూ రెట్టింపవుతారు! ఒకరికి ఇద్దరమైనట్లే సుఖ సుంతోషాలూ రెట్టింపు పెరుగుతాయి! అర్థమైందా...?" అంటూ నవ్వాను.

"చాలా బాగా చెప్పారు..." ఆ మాటలకి వెనక్కి తిరిగి చూశాను.

నవ్వు మొహంతో ... విష్ణు!

అక్కడకు ఎప్పుడు వచ్చారో గమనించలేదు. ఆశ్చర్యంగా చూస్తుంటే ఆంటీ చెప్పారు.

విష్ణు ఇక తరచూ వైజాగ్ రావాల్సిన పనులుండటంతో హోటల్లో రూము తీసుకోవాలనుకుంటుంటే, ఖాళీగా ఉంటున్న మేడమీద గదిలో ఉండొచ్చని అంకుల్ విష్ణుకు నచ్చచెప్పి ఎలాగో ఒప్పించారట. అంతకు ముందు రోజే విష్ణు వచ్చారని అర్థమైంది.

కరుణకు ఫోన్ వస్తే సెల్ తీసుకొని లోపలకు వెళ్ళింది. ఏదో తీసుకురావటానికేమో ఆంటీ కూడా "ఇప్పుడే వస్తాను..." అంటూ లోపలకి వెళ్ళారు

"ఏమిటలా చూస్తున్నారు? మీ ఉపన్యాసం ఎక్కడ ఉంటే నేనూ అక్కడ ప్రత్యక్షమై పోతున్నాననా...?" అంటూ నా ఎదురుగా ఉన్న సోఫాలో విష్ణు కూర్చున్నారు.

నాకు కొంచెం సిగ్గుగా అనిపించింది. నేనేం మాట్లాడినా ఉపన్యాస ధోరణిలోకి దిగిపోతానని పరిహాసం కాబోలు! ఆ మాటే అన్నాను.

"ప్రేమ, పెళ్ళి గురించి.. మీ అభిప్రాయాలు నచ్చాయి. నిజం చెప్పాలంటే నేను మీ మాటలకు అభిమానినైపోయాను! వేళాకోళం కాదు!" కళ్ళల్లో మాత్రం అల్లరి నవ్వు కనిపిస్తోంది.

"మీరు కాదని అన్నాగానీ, మిమ్మల్ని చూస్తుంటే వేళాకోళం చేస్తున్నారని తెలిసిపోతోంది!" అన్నాను.

"అయితే మీరు చాలా పొరబడుతున్నారు. నా మాటల్లో మీకు పరిహాసం కనిపిస్తే, అది రవ్వంతే.. ప్రశంసే మరింత!" అన్నారు చిరునవ్వుతో.

నేను ఇంకేం మాట్లాడలేదు. నా పెదవుల పైకీ చిరునవ్వు వచ్చింది.

మొత్తానికి ఏ కారణం వల్లనయితేనేం కరుణ పెళ్ళికి ఒప్పుకుంది. కాకపోతే ఒక సంవత్సరం వరకూ పెళ్ళి తలపెట్టకూడదని షరతు పెట్టింది. దానికి ఆంటీకూడా సంతోషంగానే అంగీకరించారు. కరుణ నాతో ఒక మాట అంది. "ఈ సంవత్సరంలో నీ పెళ్ళి అయిపోతే, పెళ్ళి గురించి అప్పుడు నీ అభిప్రాయం స్వానుభవంతో చెప్పు" అని.

"దీనికో అనుభవం అక్కర్లేదు. ఒంటరిగా ఉన్నా, పెళ్లి చేసుకున్నా సమస్యలనేవి ఏవో ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. కాదనటం లేదు. కాకపోతే ఆ సమస్యల్ని సామరస్యంగా పరిష్కరించుకునే నేర్పు, ఓర్పు ఉండాలంతే!" మళ్ళీ ఉపన్యాస ధోరణిలోకి దిగిపోతున్నాననిపించి విష్ణు వేపు చూస్తూ నవ్వేశాను. నేనే ఉద్దేశ్యంతో నవ్వానో విష్ణుకూ అర్థమైనట్లుంది. తనూ నవ్వారు.

విష్ణు నవ్వు ఆహ్లాదకర అనుభూతిని కలిగిస్తుందని మొదటిసారిగా అనిపించింది!

❊ ❀ ❊

బిజినెస్ పనుల మీద విష్ణు తరచూ వైజాగ్ వస్తున్నారు. అంకుల్ వాళ్ళింట్లో నేను రెండు మూడు సార్లు కలవడం జరిగింది. హైద్రాబాద్‌లో ఉండే విష్ణు వాళ్ళ లాయరు పరమేశం గారే విష్ణుకు రామబ్రహ్మం అంకుల్‌ని పరిచయం చేశారట. విష్ణు వాళ్ళ వ్యవహారాలకు సంబంధించి సలహాలు, సూచనలు అంకులే ఇస్తున్నారనుకుంటాను.

ఎవరితోనైనా సరే మృదువుగా, మర్యాదగా మాట్లాడే విష్ణు మాటతీరును, తెలివితేటల్నీ, మంచితనాన్నీ అంకుల్ మెచ్చుకోవటం విన్నాను. అంకుల్ మాటలు నూటికి నూరుపాళ్ళు నిజమని నేనూ అనుకున్నాను.

✻ ❀ ✻

ఆ రోజు...

ఉదయమే లేచి తలస్నానం చేసి కొత్త బట్టలు వేసుకున్నాను. నాయనమ్మ నా చేత దేముడి ముందు కొబ్బరికాయ కొట్టించింది. ప్రతీరోజూ స్నానం చేశాక నాన్నమ్మ పూజ చేసుకునే విగ్రహాల ముందు కూర్చుని అయిదు నిమషాలు నేనూ ధ్యానం చేస్తాను. పుట్టిన రోజున మాత్రం దీపారాధన, కొబ్బరి కాయ కొట్టడం నాన్నమ్మ నాతోనే చేయిస్తుంది.

ఆ సంవత్సరం నాన్నగారు లేకుండా జరుగుతున్న మొదటి పుట్టిన రోజు. ముందు రోజే విష్ణు, రామబ్రహ్మం అంకుల్ వాళ్ళతో నాన్నగారు నెల్లూరు వెళ్ళారు. విష్ణు వాళ్ల బిజినెస్ వ్యవహారం అయినా, నాన్నగారూ ఉంటే తనకి కొంచెం సహాయంగా ఉంటుందని అంకుల్ మరీ మరీ అనడంతో వెళ్ళక తప్పింది కాదు.

పద్మని రమ్మన్నాను. పదిగంటలప్పుడు వచ్చింది. మధ్యాహ్నం వరకూ ఉండి నాతో కలిసి భోజనం చేసి వెళ్ళింది. మామూలుగా అయితే సాయంకాలం నేనూ, నాన్నగారూ బీచ్‌రోడ్‌లోని కాళికా ఆలయానికి వెళ్ళేవాళ్ళం. ఒక్కదాన్నీ వెళ్ళాలనిపించలేదు. నాయనమ్మ చేసిన చేగోడీలనీ, సున్నుండలనీ నాలుగు పాకెట్స్‌లో సర్దాను. రాజవ్వకి, ఆమె మనవలకీ కొన్న బట్టల్ని తీసుకొని నాన్నమ్మకి చెప్పి బయటకు వచ్చాను.

నేను ఇంటర్‌లో చేరిన మొదటి సంవత్సరం అనుకుంటాను రాజవ్వతో నాకు పరిచయం కలిగింది. స్కూటీ సడన్‌గా ఆగిపోతే, దగ్గరలో ఉన్న మెకానిక్ షెడ్‌లో ఇచ్చి బస్సు ఆ రూటులో ఏది వస్తుందా అని ఆలోచిస్తూ నిలబడ్డాను. చెట్టు క్రింద వేరుశనగకాయల బుట్ట పెట్టుకొని కూర్చున్న అవ్వ “ఎండలో నిలబడినావేటి తల్లీ ... నీడలోకి రామ్మా...” అని పిలిచింది. అది చాలా చిన్న విషయమే కావచ్చు... కానీ నాకు మాత్రం ఆమె పిలుపులోని ఆదరానికి చాలా సంబరం కలిగింది!

ఎవరి గొడవ వాళ్ళు చూసుకోవటమనేది మామూలే. పక్కవాళ్ళ పట్ల అవసరంలో సానుభూతినీ, ఆప్యాయతనీ చూపించేవాళ్ళు మాత్రం విశిష్ట వ్యక్తులే! ఆ రోజు ఆ చిన్నమాటలో అవ్వ కనబరిచిన ఆప్యాయతే మా మధ్య పరిచయానికి నాంది అయింది! నేను వెంటనే అవ్వ పక్కనే చెట్టు నీడలో నిలబడి మాటలు కలిపాను. వేరు శనగకాయలూ కొని బ్యాగ్‌లో వేసుకున్నాను. అప్పటి నుండీ రెండు మూడు రోజులకోసారయినా రెండు నిమిషాలు అవ్వ దగ్గర ఆగి క్షేమసమాచారాలడిగి వేరుశెనగకాయలు కొనడం రివాజయిపోయింది.

అవ్వ కొడుకు యాక్సిడెంట్‌లో చనిపోయాడు. అతనికి ముగ్గురు పిల్లలు. అవ్వ కోడలు కూలి పనికి వెళుతుంది. ఒక అబ్బాయిని నాన్నగారే సాగర్ నగర్‌లోని తన స్కూలులో ఫీజులు కట్టి చదివిస్తున్నారు. చిన్నపిల్లలు ఇద్దరూ ఇంటికి దగ్గరలో ఉన్న బడికి వెళ్తున్నారు. నా ప్రతి పుట్టిన రోజుకి అవ్వకి, పిల్లలకి బట్టలు, స్వీట్సు ఇవ్వడం అలవాటుగా మారింది. పార్టీలకి ఖర్చు పెట్టే మొత్తంలో నుండి కొంతలో కొంతయినా తగ్గించుకొని, దానిని అవసరమైన వాళ్ళకు సహాయంగా అందివ్వాలనే నాన్నగారి అభిప్రాయాన్ని ఆచరణలో పెట్టటానికి నాకిది మార్గంగా తోచింది.

బాగా మబ్బులు పట్టాయి. పావుగంటలో వెళ్ళి వచ్చెయ్యవచ్చని బయలుదేరి పోయాను. బీచ్‌రోడ్ మొదలుకి వచ్చేసరికి చినుకులు పడడం ప్రారంభం అయింది. ఇంకొంచెం ముందుకు వెళ్ళేసరికి పెద్దదయిపోయింది. ఏం చేయాలో తోచక స్కూటీ ఆపి మూసేసి వున్న కిళ్ళీబడ్డీ ముందు నిలబడిపోయాను. రెండు నిమిషాల్లోనే తగ్గిపోయేసరికి, బయలుదేరబోతున్న నేను పక్కన ఆగిన కారుని గమనించలేదు.

విష్ణు కారు దిగి వచ్చి "మీరేమిటి .. ఇక్కడ..." అనగానే నేనూ ఆశ్చర్యంగా చూస్తూ "మీరు ఊరు వెళ్ళారనుకున్నానే..." అన్నాను.

చివరి నిమిషంలో డ్రాపయ్యానని చెప్పారు. తను కూడా ఉంటే అవతల వాళ్ళకి తన నిర్ణయం వెంటనే చెప్పాల్సిన మొహమాటం ఉంటుందని అనిపించిందట. ముందుగా అంకుల్ మాట్లాడి వస్తే ఆలోచించి నిర్ణయించుకునే సమయం ఉంటుందని అలా చేశానని చెప్పారు. నాకు తెలియని బిజినెస్ వ్యవహారం కాబట్టి నేను వివరాలడగకుండా విని ఊరుకున్నాను.

నా విషయం అడిగినప్పుడు ఫ్రెండ్స్‌ని కలవటానికి వచ్చానని చెప్పి దూరంగా కనిపిస్తున్న పాక ముందున్న ఇద్దరు పాపలని చూపించేసరికి విష్ణు ఆశ్చర్యంగా

“నిజంగానా...?” అన్నారు. నేను క్లుప్తంగా విషయం చెప్పాను. చెప్పకుండా ఉండటానికి వీల్లేని పరిస్థితి మరి. పుట్టిన రోజని తెలిసి విష్ణు “నిజమా, అనవసరంగా మీ నాన్నగారిని ఊరుకు పంపించేశానే...” అని “నేను మీ ఇంటి దగ్గర ఉంటాను. తొందరగా రండి ...” అంటూ కారు స్టార్టు చేసి వెళ్ళిపోయారు.